ప్రజాశక్తి

బుధవారం 22 మార్చి 2022 | 1 | అనంతపురం | శ్రీ సత్యసాయి





'సాంస్కృతిక జాతీయవాదం దేశానికి ముప్పు'

వార్త 5వ పేజీ



యువగళం పాదయాత్రలో పాల్గొన్న నారాలోకేష్

టిడ్కో గృహాలను పూర్తి చేయలేని

అసమర్ధ ప్రభుత్వం

యువగళం పాదయాత్రలో నారా లోకేష్

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు చేపట్టిన టిడ్కో గృహాలను సైతం పూర్తి చేయలేని అసమర్ధ ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పాదయాత్ర 49వ రోజుకు చేరుకుంది. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణం నుంచి మంగళవారం పాదయాత్ర మొదలైంది. ఉదయం కదిరి ఆర్డీవో కార్యాలయం నుంచి పాదయాత్ర మొదలైంది. అక్కడి నుంచి పట్టణ సమీపంలోని టిడ్కో గృహాలను పరిశీలించారు. ఆలీపూర్ తండా, ముత్యాలచెరువు వద్ద స్థానికులతో ముఖాముఖి నిర్వహించారు. మధ్యాహ్నం పుట్టపర్తి నియోజకవర్గంలోకి పాదయాత్ర చేరుకుంది.

వార్త మెయిన్‌లో..

అన్నదాతలను ఆదుకోండి

సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బివి.రాఘవులు

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన అకాల వర్షానికి వందలాది ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలను నష్టపోయారని, ప్రభుత్వం తక్షణం వీరికి నష్టపరిహారం అందజేయాలని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బివి.రాఘవులు డిమాండ్ చేశారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఇటీవల అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మండల పరిధిలోని మూర్తిపల్లి, వరిగిరెడ్డిపల్లి, బత్తలపల్లి, అనంతపురం జిల్లా నార్పల మండల పరిధిలోని కేశేపల్లి, వెంకటాంపల్లి, నాయనపల్లి గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న మొక్కజొన్న, అరటి, చీనీ, కాయగూరల పంటలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో బాధిత రైతులతో మాట్లాడి నష్టం వివరాలను తెలుసుకున్నారు.



కదిరిలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న బివి.రాఘవులు

వార్త మెయిన్‌లో..



ఉగాది పచ్చడిని తయారు చేస్తున్న విద్యార్థినులు

ఘనంగా ఉగాది వేడుకలు

అనంతపురం : స్థానిక మూడో రోడ్డులోని సాయి విజ్ఞాన్ పాఠశాలలో తెలుగు సంవత్సరం ఉగాది వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా పాఠశాల డైరెక్టర్లు ఎంపీ శ్రీనివాసులు, కరుణాకర్ బాబు ప్రిన్సిపల్ లావణ్య రామ్ విద్యార్థులకు శుభకృత నామ సంవత్సరం ఉగాది పండుగ విశిష్టతను వివరించారు. తెలుగువారు ఎంతో గొప్పగా చేసుకునే ఉగాది పండుగ తెలుగు సంప్రదాయాలను ప్రకాశింపజేస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. అనంతరం ఉగాది పచ్చడిని ఆరగించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సజావుగా వేలంపాట

కళ్యాణదుర్గం : 2023-24 ఆర్థిక సంవత్సరానికి మంగళవారం నిర్వహించిన మున్సిపల్ వేలం సజావుగా సాగింది. దుర్గం మున్సిపాలిటీకి సంబంధించిన వారపుసంత, రోడ్డుమార్జిన్, బస్టాండ్, లారీస్టాండ్‌కు కమిషనర్ వెంకటేశులు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు వేలంపాట ప్రారంభమైంది. ఈపాటలో వారపు సంత రూ.2.60లక్షలు, రోడ్డు మార్జిన్ రూ.3.31లక్షలు, బస్టాండ్ రూ.1.58 లక్షలు, లారీస్టాండ్ 4.30 లక్షలకు వేలంపాట పాడి దక్కించుకున్నారు.

రెండురోజుల్లో పంటనష్టం జాబితా అందించాలి

జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

బుక్కరాయసముద్రం : ఇటీవల కురిసిన భారీ గాలివానకు పంటలు నష్టపోయిన రైతుల జాబితాను రెండు రోజుల్లో తమకు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని పొడరాళ్ల, రేగడికొత్తూరు గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తి వివరాలను తెలుసుకుని పంటనష్టం జాబితాను రెండు రోజుల్లో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఎర్రిస్వామి, మండల వ్యవసాయాధికారి శ్యాంసుందర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సయహకుడు శ్రీనివాస్, వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతిరైతునూ ఆదుకుంటాం

ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం : అకాల వర్షాల వల్ల నష్టపోయిన ప్రతిరైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబ శివారెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం మండలంలోని పొడరాళ్ల, రేగడికొత్తూరు, బి.కొత్తపల్లి గ్రామాల్లో ఇటీవల కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు సిఎం జగన్ కృతనిశ్చయంతోఉన్నారన్నారు. కావున రైతులు ఎవరూ అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ఇన్‌ఛార్జి ఆలూరు రమణారెడ్డి, ఎంపిపి డి.సునీత, జడ్పిటిసి భాస్కర్, మండల కన్వీనర్ నరేష్, బిల్లె నారాయణస్వామి, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

పని తెలిసిన వారికి ఎక్కడైనా 'ఉపాధి'

ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

పని తెలిసిన వారికి, నేర్చుకున్న వారికి ఎక్కడైనా ఉపాధి లభిస్తుందని విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ- జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వైఎస్ఆర్ క్రాంతి పథం సంయుక్తంగా మంగళవారం పట్టణంలోని పుర-కామన్ ఫెసిలిటీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకెపి, స్వయం సహాయక సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్వయం ఉపాధి కోసం కుట్టు శిక్షణ పొందిన మహిళలు ఆర్థిక సాయం పొందవచ్చన్నారు. తద్వారా ఉపాధితో కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచుకోవచ్చన్నారు. సిఎం జగన్ మహిళా పక్షపాతి కావడం వల్లే మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాలు శిల్ప మాట్లాడుతూ మహిళలు ఉచిత కుట్టు శిక్షణ పొంది స్వశక్తితో ఆర్థిక స్వావలంబన పొందాలన్నారు. ఐకెపి ఏరియా కోఆర్డినేటర్ గంగాధర్ మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో స్థానిక శిక్షణా కేంద్రంలో ఒక్కొక్క విడతకు 30 మంది చొప్పున మహిళలకు నెలన్నర రోజులపాటు కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. తొలి విడతగా రాయదుర్గం మండలం కొండాపురం చదం, చదం-గొల్లలదొడ్డి గ్రామాలకు చెందిన మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి, రాయదుర్గం పురపాలక సంఘ ఉపాధ్యక్షులు వలిబాషా, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు భోజరాజు నాయక్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, పురపాలక సంఘం మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్రరెడ్డి, మున్సిపల్ వార్డు సభ్యులు శారద, దేవరాజ్, శివకుమార్, వైకాపా నాయకులు శివ, నిజాముద్దీన్, కృష్ణమూర్తి, బషీర్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న విప్ కాపు

దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి-నార్పల

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వడగండ్ల గాలివానకు దెబ్బతిన్న పంటలను మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కనీసం ఎకరాకు రూ.50వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, టిడిపి రాష్ట్ర పార్టీ రైతు కార్యదర్శి వెంకటేశ్వర్‌నాయుడు, రైతు జిల్లా అధికార ప్రతినిధి తలారి తిప్పన్న, జిల్లా టిడిపి నాయకులు మదమంచి ప్రతాప్‌చౌదరి, వెంకటాంపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అలాగే జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు మండలంలోని వెంకటాంపల్లి, నాయనపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్, నియోజకవర్గ సీనియర్ నాయకులు కొండిశెట్టి ప్రవీణ్ కుమార్, తుపాకుల భాస్కర్, బాబానజీర్, రామయ్య, ఆది, రాపా ధనుంజయ, చొప్ప చంద్ర, ఎర్రిస్వామి, ఓబులేసు, మునీంద్ర, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న మాజీమంత్రి కాలవ



పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు నిర్మలామురళి

నేడు పంచాంగ శ్రవణం

అనంతపురం : తెలుగు సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం ఐదు నుంచి 6 గంటల వరకు రాఘవేంద్రతో పంచాంగ శ్రవణం ఏర్పాటు చేసినట్లు శిల్పారామం పరిపాలన అధికారి కృష్ణప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదేక్రమంలో ఆరు నుంచి ఏడు గంటల వరకు అమృత నృత్య కళానిలయం వారితో కూచిపూడి, జానపద ముఖ్య ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఉగాది పండుగను సంతోషంగా చేసుకోవాలి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి పేద కుటుంబం ఉగాది పండుగను సంతోషంగా చేసుకోవాలని నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు పురుషోత్తమ మురళీకృష్ణ, నిర్మలామురళి తెలిపారు. ఉగాది పండుగను పురస్కరించుకుని మంగళవారం ఆదర్శనగర్‌లోని నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమంలో 25 పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగాది పండుగ రోజున మొదటగా పుట్టినిల్లు ఆశ్రమంలో పేదలకు నిత్యావసరాలు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఆశ్రమంలో ఉండే మహిళలకు రోజూ పండుగ వాతావరణం ఉండేలా చూసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రవి, ఆదిలక్ష్మి, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీరు

ఉరవకొండ : ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీరు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని హావలిగి గ్రామ సర్పంచి గీతమ్మ తెలిపారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం విడపనకల్లు మండల పరిధిలోని హావలిగి ఎస్సీ, బీసీ కాలనీల్లో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి పైప్ లైన్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను అనుసరించి వీలైనంత త్వరలో పైప్‌లైన్ పూర్తి చేసి ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సురేష్‌బాబు, వెసిపి నాయకులు రఘురాములు, రాజశేఖర్, మడకశిర, స్వామి, యల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

నష్టం 11052 ఎకరాలు..!

అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలు - ఉద్యానవన పంటనష్టం రూ.211 కోట్లు


ఇటీవల కురిసిన పుట్లూరులో నేలకొరిగిన అరటిచెట్లు(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అకాల వర్షాలు అనంత రైతు నడ్డి విరిచాయి. గత వారంలో అల్పపీడన ప్రభావంతో పడిన వర్షాలకు తీవ్రమైన నష్టాన్నే రైతులకు మిగిల్చాయి. ప్రధానంగా ఆరటి రైతులకు నష్టం వాటిల్లింది. గతంలో ఎన్నడూలేనంతగా అరటి ధర టన్ను రూ.20 వేలకుపైగా పలుకుతోంది. ఇటువంటి సమయంలో వేసవి కాలంలో పంట చేతికొచ్చిన సమయంలో వీచిన గాలివాన, వడగండ్లకు చేతికొచ్చిన పంట నేల రాలింది. ఏపుగా పెరిగిన చెట్లు వాలిపోవడంతో పంట మొత్తం దెబ్బతింది. పంటనష్టంలో అత్యధికంగా అరటి పంటే ఉంది. ఆ తరువాత మామిడి, బత్తాయి పంటలున్నాయి. ఇవి కూడా ఇదేసమయంలో పంటకోతకు వచ్చి ఉన్నాయి. రైతకు చేతికొచ్చిన పంట నోటికందకుండాపోయింది.

16 మండలాల్లో నష్టం

రెండు రోజుల క్రితం జిల్లాలో కురిసిన గాలీవాన, వడగండ్లకు పెద్దఎత్తున ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. సుమారు 16 మండలాల్లో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. 11052 ఎకరాల్లో పంటలు దెబ్బతినింది. సుమారు రూ.211.91 కోట్లు పంటనష్టం వాటిల్లినట్టు ఉద్యానవన శాఖ అధికారులు అంచనా వేశారు. దెబ్బతిన్న పంటల్లో అత్యధికం అరటి పంటే ఉంది. అరటికి మంచి ధర ఉన్న సమయంలో పంట మొత్తం నేలపాలు కావడంతో రైతులు తీవ్రమైన నిరాశను వ్యక్తం చేస్తున్నారు.

11052 ఎకరాల్లో పంట నష్టం

అధికారుల అంచనాల ప్రకారం సుమారు 16 మండలాల్లో 11052 ఎకరాల్లో పంటనష్టం జరిగింది. నష్టం విలువ రూ.211.91 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. 4612 మంది రైతులకు ఈ నష్టం వాటిల్లింది. జరిగిన నష్టంలోనూ ఎక్కువగా నార్పల, శింగనమల, పుట్లూరు, యల్లనూరు మండలాలున్నాయి. ఈ మండల్లాల్లోనే ఎక్కువగా గాలీవాన, వడగండ్ల వర్షం పడింది. దెబ్బతిన్న పంటల్లోనూ అత్యధికం 6852 ఎకరాల్లో అరటి పంట ఉంది. అంటే దాదాపు యాభై శాతం అరటి పంటయే ఉంది. రూ.166.61 కోట్లు అరటి పంటనష్టంగా అంచనా వేశారు. ఆ తరువాత అత్యధికంగా దెబ్బతిన్న పంట మామిడి. ఇది 1088 ఎకరాల్లో దెబ్బతింది. రూ.18.49 కోట్లు నష్టం వచ్చింది. బత్తాయి పంట 1480 ఎకరాల్లో దెబ్బతినగా ర.21.29 కోట్లు నష్టం వచ్చింది. 375ఎకరాల్లో టమోటా రూ.1.15 కోట్లు నష్టం రాగా, దానిమ్మ 121 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. దీని నష్టం రూ.1.31 కోట్లు. 420 ఎకరాల్లో మిర్చి పంట దెబ్బతినింది. రూ.66 లక్షలు నష్టం వచ్చింది. ఇవి కాకుండా ఇతర పంటలకు నష్టం కలిపి మొత్తం రూ.211. కోట్లు వచ్చింది.

అత్యధికం నాయనపల్లి పరిధిలో..

నార్పల మండలం నాయనపల్లి గ్రామం పరిధిలో అత్యధికంగా పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో అరటి పంట 530 ఎకరాల్లో దెబ్బతింది. దీని నష్టం రూ.31.80 కోట్లు ఉంది. ఆ తరువాత నడిమిదొడ్డి గ్రామంలో రూ.15.60 కోట్లు పంట దెబ్బతింది. మడుగుపల్లిలో రూ.20 కోట్లు, మడ్డిపల్లిలో రూ.26 కోట్లు నష్టం వచ్చింది. ఈ గ్రామాల్లో అత్యధికంగా పంటలు దెబ్బతిన్న వాటిల్లోనున్నాయి.

విద్యార్థులకు రాగిజావా


సత్యసాయి కలెక్టరేట్‌లో రాగిజావ తాగుతున్న కలెక్టర్, ఎంపీ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్, కొత్తచెరువు

తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం నాడు వర్చువల్ విధానం ద్వారా జగనన్న గోరుముద్దలో బడిపిల్లలకు ఉదయం పూట రాగిజావ అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించారు. శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి నిర్వహించిన కార్యక్రమంలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, కలెక్టర్ పి.బసంత్ కుమార్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, ఎడిసిసి బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత, ఆర్డీవో భాగ్యరేఖ, ఇన్‌ఛార్జి డీఈవో మీనాక్షి పాల్గొన్నారు. అనంతపురం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయ భాస్కర్ రెడ్డి, డీఈఓ ఎం. సాయిరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో మరో పోషకాహారం అందించడంలో భాగంగా బడిపిల్లలకు ఉదయం పూట రాగిజావ అందించేందుకు శ్రీకారం చుట్టామన్నారు. పిల్లలను మరింత ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు రాగిజావ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సత్యసాయి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2,034 పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద కార్యక్రమం అమలవుతోందన్నారు. ప్రతిరోజూ 1,46,744 మంది విద్యార్థులకు రాగిజావా అందిస్తామన్నారు. ఈ పథకం కింద కొత్త మెనూలో భాగంగా వారానికి ఐదు సార్లు కోడిగుడ్లు, వారానికి మూడుసార్లు చిక్కిలు ఇస్తామన్నారు. శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సేవాదళ సభ్యులు ప్రసాదాన్ని రాగిజావ రూపంలో పంపిణీ చేస్తూ విద్యార్థుల అభివృద్ధికి తోడ్పాటు అందివ్వడం అభినందనీయం అన్నారు. అనంతపురం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,698 పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద కార్యక్రమం అమలవుతోందన్నారు. ఈ పథకం కింద ప్రతిరోజూ 2,07,550 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ ముఖ్యమంత్రితో వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా మాట్లాడారు. శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ తరపున ఈ గొప్ప కార్యక్రమంలో తాము భాగస్వామ్యం కావడంపై సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వర్ఫ్ బోర్డ్ వైస్ ఛైర్మన్ షాన్‌సెట్, ఎంపీటీసీ మహమ్మద్ రఫీ, ఆవుల రాము, అనంతపురం ఏడీ ఎస్.కష్ణయ్య, డిప్యూటీ డిఇఒ పద్మప్రియ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక భవన నిర్మాణాన్ని పరిశీలించిన బివి.రాఘవులు


కార్మిక, కర్షక భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న బివి.రాఘవులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి జిల్లా కేంద్రంలో కమ్యూనిస్టు నాయకురాలు దేశిరెడ్డి నాగమ్మ పేరుతో నిర్మిస్తున్న కార్మిక, కర్షక భవన నిర్మాణాన్ని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బివి.రాఘవులు పరిశీలించారు. మంగళవారం కదిరి కోర్టులో వాయిదా నిమిత్తం వచ్చిన ఆయన భవన నిర్మాణాన్ని పరిశీలించి, సిపిఎం నాయకులకు పలు సూచనలు చేశారు. నూతన జిల్లా కేంద్రంలో కార్మిక కర్షక కేంద్రం బుక్కపట్నం దేశి రెడ్డి నాగమ్మ పేరుతో నిర్మిస్తుండడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో మహిళ కమ్యూనిస్టు నాయకురాలుగా నాగమ్మ ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. ఈ భవన నిర్మాణం పూర్తి అయితే కార్మికులు, కర్షకులు సిపిఎం సమావేశాలు ఇందులోనే జరుపుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, నాయకులు ఈఎస్.వెంకటేష్, పైపల్లి గంగాద్రి, బ్యాళ్ల అంజి, గౌస్ లాజాం, బాబావలి, నాగరాజు, గంగాద్రి పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రకు తరలివెళ్లిన నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌కు స్వాగతం పలకడానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. మంగళవారం సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలోని నల్లమాడ మండలం పులగంపల్లికి మధ్యాహ్నం 2:30 గంటలకు పాదయాత్ర అడుగెడుతున్న సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సారథ్యంలో భారీగా తరలి వెళ్లారు. పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల నుంచి ద్విచక్ర వాహనాలలో బయలుదేరి వెళ్లారు. వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలలో ఉత్సాహంగా పార్టీ జెండాలతో వెళ్లారు. సమ్మతి, అసమ్మతి అనే భేదాలు లేకుండా నాయకులందరూ నారా లోకేష్ దష్టిలో పడటానికి పోటాపోటీగా వారి అనుచరులతో వెళ్లారు.

టిడిపి హయాంలోనే ముస్లిములకు అన్యాయం

ప్రజాశక్తి-కదిరి అర్బన్

టిడిపి హయాంలో రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలను తీవ్ర అన్యాయం జరిగిందని వైసిపి మాజీ సమన్వయకర్త ఎస్ఎండి ఇస్మాయిల్ విమర్శించారు. ఈ మేరకు ఆయన మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో భాగంగా కదిరి నియోజకవర్గంలోని పివిఆర్ కళ్యాణ వేదికలో సోమవారం ముస్లిం మైనార్టీలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ముస్లింలపై కపట ప్రేమ కురిపించారని అన్నారు. రాష్ట్ర చరిత్రలో 2014 మంత్రిమండలిలో ముస్లిం మైనార్టీ శాఖను ముస్లింలకు కట్టబెట్టకుండా నాలుగు సంవత్సరాల పాటు ముస్లిమేతరులకు ఈ శాఖను అప్పగించారని గుర్తు చేశారు. ని చివరి ఆరు నెలల కాలంలో కంటి తుడుపు చర్యగా నంద్యాల ఫరూఖ్‌కు ఇచ్చారన్నారు. టిడిపి ప్రభుత్వంలో కంటే పది రెట్లు ఎక్కువ రాష్ట్రంలో తెలుగు తర్వాత అత్యధికంగా మాట్లాడే ఉర్దూకు ద్వితీయబాష హోదా కల్పించామన్నారు. టిడిపి ప్రభుత్వంలో అక్రమాలకు గురైన వక్ఫ్ భూములన్నింటినీ తిరిగి స్వాధీనం చేసుకోవడానికి వక్ఫ్ బోర్డుకు స్వతంత్ర అధికారాలు కట్టబెట్టామన్నారు.

అమరజీవి అప్పారి వెంకటస్వామికి నివాళి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణదక్షుడు అమరజీవి అప్పారి వెంకటస్వామి ఆశయాలను కొనసాగించడమే మనం ఇచ్చే నిజమైన నివాళి అని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప కొనియాడారు. మంగళవారం నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో అప్పారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ యుటిఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అప్పారి వెంకటస్వామి 25 సంవత్సరాల పాటు పని చేశారని తెలిపారు. 1953లో ఉపాధ్యాయ ఉద్యమంలో ప్రవేశించిన వెంకటస్వామి 1958 నుంచి బాధ్యతలు తీసుకుని చురుకుగా పాల్గొన్నారన్నారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత అమరజీవి లక్ష్మయ్య మరణం తర్వాత సంఘం నాయకత్వంలో వచ్చిన అరాచక, విచ్ఛిన్నకర పోకడలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని తెలిపారు. ఆ సమయంలో చెంచుపాటి ఆశయాల బాటలో ఉపాధ్యాయుల పక్షాన నికరంగా పని చేయగలిగిన సంఘం చారిత్రక అవసరంగా గుర్తించిన ఫలితంగా 1974 ఆగస్ట్ 10న యుటిఎఫ్ ఆవిర్భవించిందన్నారు. అప్పుడు వెంకటస్వామిని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారన్నారు. నాటి నుంచి యుటిఎఫ్ అంచెలంచెలుగా ఎదిగి అగ్రగామి ఉపాధ్యాయ సంఘంగా ఎదిగి నేటికీ కొనసాగుతోందన్నారు. 2001 మార్చి 21న తుదిశ్వాస విడిచే వరకు ఉద్యమమే జీవితంగా పని చేసిన నాయకుడు ఎవిఎస్ అన్నారు. ఆయన ఉద్యమ స్ఫూర్తితో ప్రస్తుతం ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్ర, నాయకులు గంగాదర్, శేషప్ప, వీరేశ్వరచారి, సీనియర్ నాయకులు రాజగోపాల్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎపిఎం తిప్పమ్మ

'చేయూత' మార్ట్‌లో అమ్మకాలు నిర్బంధం కాదు..

నార్పల : మండల కేంద్రంలోని మహిళా మార్ట్‌లో అమ్మకాలు బలవంతం కాదని, స్వచ్ఛందమే అని ఎపిఎం తిప్పమ్మ తెలిపారు. శనివారం ప్రజాశక్తి దినపత్రికలో మహిళా మార్ట్‌లో బలవంతపు అమ్మకాలు.. ఆందోళనలో సభ్యులు అన్న కథనంపై ఎపిఎం స్పందించారు. ఈమేరకు మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామైక్య సంఘాల సహకారంతో సంఘాల అభ్యున్నతి కోసం మహిళా చేయూత మార్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంఘం సభ్యులు కుటుంబ అవసరాల నిమిత్తం నిత్యావసర వస్తువులు మార్ట్‌లో తీసుకుంటే మార్ట్ ఆదాయం పెరిగి సంఘం సభ్యులు పెట్టిన పెట్టుబడిని త్వరగా తిరిగి ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. అంతేగానీ ఖచ్చితంగా సభ్యులు మార్ట్‌లోనే కొనాలనే నిబంధన ఏమీ లేదన్నారు. అలా ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో చేయూత మార్ట్ ఎపిఎం సునీత, సీసీలు రామకృష్ణ, నాగానంద, పుల్లారెడ్డి, అకౌంటెంట్ కోటేశ్వరమ్మ, యానిమేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేస్తున్న ప్రభుత్వం

గుంతకల్లు : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ దశలవారీగా అమలు చేస్తోందని వైసిపి బిసి సెల్ రాష్ట్ర నాయకులు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఎన్.రామలింగప్ప తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా రాగులపాడు హంద్రీనీవా పంప్‌హౌస్ నుంచి నెలగొండ, అయ్యవారిపల్లి గ్రామాల వరకు రూ.50 కోట్లతో సాగునీరు అందించేందుకు పిల్ల కాలువ పనులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే దశాబ్దాల కాలంగా సాంకేతిక విద్యార్థులు ఎదురు చూస్తున్న పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు రూ.34 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. వీటితోపాటు పలు హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్టు యార్డు ఛైర్మన్ ఎస్‌బిఆర్ మోహన్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ జింకల రామాంజినేయులు, వైసిపి పట్టణ అధ్యక్షుడు బి.సుంకప్ప, మండల కన్వీనర్ బి.మోహన్, తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబే సూత్రధారి

ఉరవకొండ : స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి టిడిపి అధినేత చంద్రబాబే అని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆరోపించారు. మంగళవారం ఉరవకొండలో పర్యటించిన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబుతోపాటు టిడిపి నేతలు దొంగల ముఠాగా ఏర్పడి రూ.371 కోట్లను షెల్ కంపెనీల ద్వారా కాజేశారని ఆరోపించారు. ఎపి అసెంబ్లీలో టిడిపి సభ్యుల వ్యవహారశైలిపై తెలుగువారందరూ సిగ్గు పడుతున్నారన్నారు. అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేలు శాసనసభ్యుల్లా కాకుండా వీధిరౌడీల్లా వ్యవహరిస్తున్నారన్నారు. ఏకంగా సభాపతి స్పీకర్‌పైనే దాడికి దిగడం దారుణమన్నారు. సభాపతి టిడిపి సభ్యులకు ఇచ్చిన సమయాన్ని వినియోగించుకోకుండా అడ్డుపడటాన్ని తప్పుపట్టారు. ఇక ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవర్తించిన తీరు, మాట్లాడిన భాష అత్యంత జుగుప్సాకరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు సిపి వీరన్న, ఎంబీసీ రాష్ట్ర డైరెక్టర్ జోగి వెంకటేశులు, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, సర్పంచి లలిత, ఎంపిపి చందా చంద్రమ్మ, జెడ్పిటిసి ఏసీ పార్వతమ్మ, ఉప సర్పంచి వన్నప్ప, జెసిఎస్ పట్టణ కన్వీనర్ ఆసీఫ్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక జాతీయవాదం దేశానికి ముప్పు

ప్రజా జాతీయవాదం కావాలి - 'సాహిత్య సాంస్కృతిక రంగాల్లో సవాళ్లు- ప్రశ్నించే గొంతుకల అణచివేత సదస్సులో బివి.రాఘవులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మెజార్టీ సాంస్కృతికవాదం దేశ సమగ్రతకు, మనుగడకు ప్రమాదకరమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు పేర్కొన్నారు. సింగమనేని నారాయణ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం స్థానిక లలితకళా పరిషత్ హాలులో 'సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో సవాళ్లు-ప్రశ్నించే గొంతుకల అణచివేత' అన్న అంశంపై సింగమనేని నారాయణ స్మారక కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. కమిటీ కన్వీనర్ ఎస్‌ఎం.బాషా అధ్యక్షతన జరిగిన ఈ సదస్సు ప్రారంభోత్సవానికి ముందు సింగమనేని నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బివి.రాఘవులు ప్రసంగించారు. భారతదేశం భిన్నమైన సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయమని తెలిపారు. ఒకరి అభిప్రాయాలను, మరొకరు గౌరవించుకుంటూ భారత రాజ్యాంగానికి కట్టుబడి నడచుకునేది ప్రజా జతీయవాదం అవుతుందని పేర్కొన్నారు. అయితే దేశంలో ప్రస్తుతం భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. మెజార్టీ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను అందరిపైనా రుద్దే ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. ఇది ఆందోళనకరమైన అంశమన్నారు. ఒక మత విధానాలకు అనుగుణంగా తక్కిన అన్ని మతాల వారు అనుసరించాలన్న విధానం సరైంది కాదని పేర్కొన్నారు. అధికారంలోనున్న బిజెపి ఇదే రకంగా మతోన్మాద విధానాలను అమలు చేసేందుకు ప్రజల మధ్య విభజన తీసుకొస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానాలను ప్రశ్నించే, వ్యతిరేకించే వారిపై నియంతృత్వాన్ని ప్రదర్శిస్తోందని చెప్పారు. ఈ విధానాలు ఇదే రకంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తూపోతే దేశ సమగ్రతకు ముప్పు వాటిల్లక తప్పదని హెచ్చరించారు. ప్రపంచ చరిత్ర ఇదే చెబుతోందని గుర్తు చేశారు. యుగోస్లేవియా, సోవియట్ యూనియన్ తదితర దేశాలు ఇదే రకంగా దెబ్బతిన్నాయని తెలిపారు. మనువాద విధానాలు మైనార్టీ మతాలపై దాడే కాకుండా హిందూ మతంలోని మహిళల స్వేచ్ఛా హక్కులపై దాడి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. బిజెపి ఇప్పటికే 'గర్బ్ సంస్కార్' పేరుతో పెద్దఎత్తున ప్రచారాన్ని సాగిస్తోందన్నారు. మహిళ గర్భంతోనున్న సమయంలో పురాణాలు, ఇతిహాసాలు వినిపిస్తే సంస్కారవంతులైన పిల్లలు పుడతారని ప్రచారం చేస్తోందన్నారు. అలాగైతే వైద్యులు గర్భంతోనున్న మహిళలకు వైద్య విజ్ఞానాన్ని అందితే పుట్టకతో విజ్ఞానవంతులుగా పుడుతారా అని ప్రశ్నించారు. ఇలాంటి అశాస్త్రీయమైన విధానాల్లో ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇంతగా సంస్కృతి గురించి మాట్లాడే బిజెపి ఈ ఏడాది ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో సాంస్కృతిక రంగానికి కేటాయించిన బడ్జెట్ కేవలం రూ.0.57 శాతం మాత్రమేనని చెప్పారు. అదే చైనాలో నాలుగు శాతం, యుఎస్‌ఎలో ఏడు శాతం కేటాయించడం జరిగిందన్నారు. దీనిపై పార్లమెంట్ సభ్యులు ప్రశ్నిస్తే విద్యా, వైద్యానికి కేటాయింపులు జరపాల్సి ఉన్నందున దీనికి తగ్గించాల్సి వచ్చిందని బిజెపి చెబుతోందన్నారు. ఆరంగాల కేటాయింపులు చూసినా నామ మాత్రంగానే నిధుల కేటాయింపులున్నాయని చెప్పారు. ఏది ఏమైనా ప్రజల మధ్య ఐక్యతను పెంచేటువంటి ప్రజా జాతీయవాదం చాలా అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, సింగమనేని స్మారక కమిటీ సభ్యులు డాక్టర్ ప్రసూన, సావిత్రి, సత్యబోసు, వి.రాంభూపాల్, నల్లప్ప పాల్గొన్నారు.





సింగమనేని నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు



వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని 10వ వార్డు, ఇందిరానగర్‌లో 15వ ఆర్థిక సంఘం నుంచి వచ్చిన రూ.4 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన బోర్వెల్ సిస్టమ్ వాటర్ ట్యాంకులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.కోట్ల నిధులతో అనేక పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా రూ.2.80 కోట్లతో జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ ఉచిత కొళాయి ఇస్తున్నామన్నారు. పంచాయతీ నిధులతో ఆయా వార్డుల్లో ఇప్పటి వరకు దాదాపు రూ.కోటి ఖర్చు చేసి 80 బోర్వెల్ సిస్టం వాటర్ ట్యాంకులు ఏర్పాటు పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లలిత, ఎంపిపి చంద్రమ్మ, జెడ్పిటిసి పార్వతమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు, ఉప సర్పంచి వన్నప్ప, బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు సీపీ.వీరన్న, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు బసవరాజు, వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతి రైతుకూ నష్టపరిహారం అందించాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

ఇటీవల కురిసిన భారీ వడగండ్ల గాలివానకు పంటలు నష్టపోయిన ప్రతిరైతుకూ నష్టపరిహారం చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో మండల వ్యవసాయాధికారిణికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అకాల వడగండ్ల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.లక్ష పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆదుకోకపోతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. అరటి, దానిమ్మ, మామిడి, చీనీ రైతులకు ఎకరాకు రూ.లక్ష మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, వ్యకాసం మండల అధ్యక్షులు ఎర్రిస్వామి, రైతుసంఘం మండల అధ్యక్షుడు సుంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు రామాంజనేయులు, ఎస్ఎఫ్ఐ సూర్యప్రకాష్, లక్ష్మీపతి, కుళ్లాయప్ప, ఆంజనేయులు, శీనా, నాగయ్య, రామకృష్ణ, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ శాఖ కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్న రైతుసంఘం నాయకులు

పంటలను పరిశీలించిన శైలజనాథ్

ప్రజాశక్తి-పుట్లూరు

ఇటవల కురిసిన భారీ వడగండ్ల వానకు మండలంలో దెబ్బతిన్న పంటలను మాజీమంత్రి సాకే శైలజనాథ్ మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని కడవకల్లు, ఓబుళాపురం, దోసలేడు, మడ్డిపల్లి, చెర్లోపల్లి, తదితర గ్రామాల్లో దెబ్బతిన్న అరటి, మొక్కజొన్న, టమోటా, దానిమ్మ తదితర పంటలను పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతుల వివరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాగాంధీ, శింగనమల మాజీ ఎంపిటిసి పూల ప్రసాద్, నాయకులు రామ్‌చరణ్, విష్ణునారాయణ, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



వర్షానికి దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న మాజీమంత్రి శైలజానాథ్

ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే పాదయాత్ర





ఒడిసి, నల్లమాడ మండలాల్లో లోకేష్ యువగళం పాదయాత్రలో పాల్గొన్న జనం

ఓబుల దేవర చెరువు : రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనపై ప్రజల్లో చైతన్యం తేవడానికి టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్నట్లు పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు మంగళవారం 49వ రోజు పాదయాత్ర కదిరి నియోజకవర్గం వదిలి పుట్టపర్తి నియోజకవర్గం లో అడుగుపెడుతున్న సందర్భంగా నారా లోకేష్‌కు టిడిపి నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. పులగంపల్లి నుంచి మిట్టపల్లి మీదుగా వణుకు వారి పల్లి వరకు పాదయాత్ర కొనసాగిందని చెప్పారు. ఈ పాదయాత్ర 25వ తేదీ వణుకు వారి పల్లి నుంచి ప్రారంభమవుతుందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, పరిటాల శ్రీరామ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రకు విశేష స్పందన

నల్లమాడ : యువగళం పాదయాత్రలో భాగంగా నల్లమాడ మండలం పులగంపల్లి వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు నారా లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ సత్య సాయి జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు వేలాదిమంది లోకేష్ కు స్వాగతం పలికారు. కదిరి ఆర్డీవో కార్యాలయం వద్ద విడిది కేంద్రం వద్ద ఉదయం ప్రారంభమైన లోకేష్ పాదయాత్ర మధ్యాహ్నం మూడున్నర గంటలకు నల్లమాడ మండల పరిధిలోని పులగంపల్లి వద్దకు చేరింది. పులగం పల్లి వద్ద వేలాదిమంది పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు లోకేష్ అభివాదం చేశారు. అక్కడి నుండి ఓబుల దేవర చెరువు మండల పరిధిలోని మిట్టపల్లి వద్దకు పాదయాత్ర చేరింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పరిటాల శ్రీరామ్, మండల కన్వీనర్ మైలే శివశంకర, నాయకులు దున్నికోట కేశవరెడ్డి, అన్నం లక్ష్మీనారాయణ, పుట్ల రవీంద్ర, చిదంబర రెడ్డి, చంద్ర, పాపారాయుడు, సలాం ఖాన్, ప్రకాష్ గౌడ్, పులగంపల్లి సర్పంచి ప్రభాకర్ రెడ్డి, నల్లమాడ సర్పంచి భారతి బాయ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల వ్యాప్తంగా వివిధ సచివాలయాల పరిధిలో ఉన్న 287 మంది వాలెంటీర్లకు మండల అధ్యక్షుడు పురుషోత్తమ రెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళ వాలెంటీర్లకు చీరలు, పురుషులకి షర్ట్,ప్యాంట్లు పంపిణీ చేశారు. ఉగాది సందర్భంగా బట్టలు పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే వాలెంటీర్లు వైసిపి ప్రభుత్వంలో తమ కుటుంబ సభ్యులని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరాపురం సర్పంచి లక్ష్మిపతి రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - పరిగి

పరిగి పంచాయతీ కేంద్రంలో పనిచేస్తున్న 25 మంది కార్మికులకు సర్పంచి శివశంకర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ఉగాది పండుగను పురస్కరించుకొని నిత్యవసర సరుకులను బద్రీనాథ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ మహమ్మద్ అలీ, బంగారు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్ర ప్రభుత్వఉద్యోగుల సమస్యల పరిష్కారించాలన్న డిమాండ్‌తో ఎపి జెఎసి అమరావతి ఆధ్వర్యంలో చేపట్టిన నల్ల బ్యాడ్జిల నిరసన కార్యక్రమం మంగళవారం13వ రోజు కొనసాగించారు.కదిరి డిపో లోఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్షులు కాలసముద్రం దివాకర్, కార్యదర్శి పి శంకరప్ప ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జిలతో విధులకు హాజరయ్యారు. నిరసన కార్యక్రమంలో రాష్ట్ర ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి చిలకం నబి రసూల్,సత్యసాయి జిల్లా కార్యదర్శి జివైపి రావు, జిల్లావైస్ ప్రెసిడెంట్ అర్‌స్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అయ్యేవరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎన్ఎం. బాషా, హరికుమార్, ఎస్‌కె. వలి, బి.శంకర్ రెడ్డి, జమీర్, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

గాండ్లపెంట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎంహెచ్ఒ ఎస్‌వి కృష్ణారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వేసవికాలంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ ఐనుద్దీన్. వైద్యాధికారులు ఉమామహేశ్వర్, మారుతి ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు అభివృద్ధికి కృషి

ఓబుల దేవరచెరువు : బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత కోరారు. ఈ మేరకు ఆమె స్థానిక ఏడీసీసీ బ్యాంకును తనిఖీ చేశారు. బ్యాంకు లావాదేవీల గురించి మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. డిపాజిట్ల సేకరణ, ఎల్‌టి రుణాలు తదితర వాటిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ పి కుసుమకుమారి, ఫీల్డ్ ఆఫీసర్ పి బ్రహ్మాచారి, అసిస్టెంట్ మేనేజర్లు పి ఇంతియాజ్, ఎన్ ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

శ్రీవాణి స్కూల్‌లో ఉగాది వేడుకలు

తలుపుల : మండల కేంద్రంలోని శ్రీవాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పాఠశాల కరస్పాండెంట్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఉగాది వేడుకలలో భాగంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో అలరించారు.

పుచ్చలపల్లి లీలా సుందరయ్య వర్థంతి



నివాళులు అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

పుచ్చలపల్లి లీలా సుందరయ్య వర్ధంతిని సిపిఎం నాయకులు మంగళవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పెద్దన్న మాట్లాడుతూ లీలమ్మ పార్టీ అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. పార్టీ మీద ఆమెకు అచెంచల విశ్వాసం ఉండేదన్నారు. భర్త సుందరయ్య కు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిందన్నారు. సుందరయ్య కు ఉద్యమ సహచరిగా ఉంటూ కళాకారిణిగా గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రజలను కదిలించి తోడుగా ఉండేదని గుర్తు చేశారు. రైతు కూలీ సంఘం సీనియర్ నాయకులు ఖాసిం మాట్లాడుతూ 33 శాతం మహిళా రిజర్వేషన్ సాధిస్తూ కమ్యూనిస్టు పరిపాలన తీసుకురావడమే లీలమ్మకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు హనుమయ్య , వెంకటేశులు, మాజీ వార్డు మెంబర్ వెంకటేశులు , సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు , భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణ , చేనేత మండల నాయకులు శీలా నారాయణస్వామి, ఈడిగ నాగరాజు, దేవాంగం వెంకటేశులు, హుస్సేన్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రవి , ఐద్వా లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది తీరుపై ఫిర్యాదు

రొద్దం : సచివాలయ సిబ్బందికి నాయకులంటే కనీస గౌరవం లేదని మండల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సచివాల సిబ్బంది, విఆర్‌ఒలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో స్థానిక ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో గృహ నిర్మాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా పలువురు నాయకులు, సర్పంచులు ఎంపిటిసీలు తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సచివాలయానికి నాయకులు వెళితే సిబ్బంది కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదని అన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై నాయకులకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వడం లేదన వాపోయారు. నాయకులకు అధికారులు సహకరించకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోతున్నాయని ఎమ్మెల్యే వద్ద వాపోయారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అనంతా చారి, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, హౌసింగ్ ఏఈతో పాటు ఎంపీపీ చంద్రశేఖర్, రాష్ట్ర స్వచ్ఛంద కార్పొరేషన్ డైరెక్టర్ వి నారాయణ రెడ్డి, నాయకులు, సర్పంచులు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న బికె. పార్థసారధి

రొద్దం : నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఈనెల 26న పెనుకొండ నియోజకవర్గంలోని గోరంట్ల మండలంలో ప్రవేశిస్తున్నందున ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పెనుగొండ మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారధి కోరారు. సూచించారు. మండలంలోని ఆరుమూరు పల్లి గ్రామంలోని తన స్వగృహంలో మండల నాయకులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన మండల నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యువగళం పాదయాత్రపై మండల నాయకులతో చర్చించారు. ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో నాయకుల కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, పెనుగొండ నియోజకవర్గం కమిటీ అధ్యక్షుడు చిన్నప్పయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి నరసింహులు, సీనియర్ నాయకులు రామకృష్ణ, జివిపి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు, పెనుకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి బికె. పార్థసారథి కోరారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన మధ్యాహ్నం యువగళం పాదయాత్ర పెనుకొండ నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్దయ్య, టౌన్ కన్వీనర్ రవిశంకర్, సీనియర్ నాయకులు మునిమడుగు చిన్న వెంకటరాముడు, కేశవయ్య, శ్రీనివాసులు, పాలడుగు చంద్ర, రఘువీర చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఎమ్మెల్యే ఆగ్రహం

గోరంట్ల : జగనన్న ఇంటి నిర్మాణాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్ల వైఖరిపై స్థానిక ఎమ్మెల్యే శంకరనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపిడివో కార్యాలయంలో మంగళవారం జగనన్న ఇంటి నిర్మాణాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యేకు తమ సమస్యను విన్నవించారు. ఇంటి బిల్లు మంజూరు కావాలంటే ఇంజనీర్ అసిస్టెంట్లు డైరెక్ట్‌గా డబ్బులు అడుగుతున్నారని ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే శంకర్నారాయణ ఇంజనీర్ అసిస్టెంట్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇంటి బిల్లులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. నెలరోజుల తర్వాత నిర్వహించే సమీక్షలోపు తీరుమారక పోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ నాగరాజు, తహశీల్దార్ రంగనాయకులు, ఎంపిడివో రఘునాథ్ గుప్తా, జెడ్పీటీసీ జయరాం నాయక్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ శంకర్ రెడి తదితరులు పాల్గొన్నారు.

వేలంపాటలో రూ.1.28 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ కార్యాలయ ఆవరణంలో మునిసిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ వేలం పాటలో పురపాలక సంఘానికి రూ. 1.28 లక్షల ఆదాయం లభించింది. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సుంకం వసూలు చేయడానికిపురపాలక సంఘ పరిధిలోని మునిసిపల్ దినసరి కూరగాయల పెద్ద మార్కెట్, చిన్న పశువులు వాటి తోళ్ల మార్కెట్, పెద్ద పశువులు వాటి తోళ్ళ మార్కెట్, పరిగి బస్టాండ్ ఆవరణంలోని ఖాళీ స్థలాలకు బహిరంగ వేలం నిర్వహించారు. ఇందులో పెద్ద మార్కెట్ రూ.41.23 లక్షలతో వేలం నిర్వహించగా రూ. 41,49,999తో హెచ్చు పాట పాడి అస్మాబాను దక్కించుకుంది. చిన్న పశువులు వాటి తోళ్ల మార్కెట్ రూ. 6.22 లక్షలు నిర్వహించగా రూ. 6.36 లక్షలకు మాహే జబీన్ దక్కించుకున్నారు. పెద్ద పశువులు వాటి తోళ్ల మార్కెట్ రూ.1.12 లక్షలు నిర్వయించగా రూ.1.13 లక్షలకు షిరిన్ దక్కించుకున్నారు. పరిగి బస్టాండ్ ఆవరణంలో ఖాళీ స్థలాన్ని రూ.15.43 లక్షలతో బహిరంగ వేలం వేయగా రూ. 16.49 లక్షలకు అన్వర్ ఖాన్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాబోవు ఆర్థిక సంవత్సరానికి నిర్వహించిన బహిరంగం వేలంపాటలో పురపాలక సంఘానికి రూ. 1.28 లక్షలు ఆదాయం లభించిందన్నారు. హెచ్చు పాట పాడిన వారికి కౌన్సిల్ తీర్మానం మేరకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు ఆయా ప్రాంతాలలో పురపాలక సంఘం వారు విడుదల చేసిన గెజిట్ మేరకు సుంకం వసూలు చేయడానికి అనుమతులు ఇస్తున్నామన్నారు. ఈ బహిరంగ వేలం పాటలో రెవిన్యూ అధికారి రంగారావు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు రామాంజి, రాము, మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన నాయకులు

గోరంట్ల : హిందూపురం పార్లమెంట్ టిడిపి కార్యదర్శి కొత్తపల్లి నరసింహప్ప యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా నరసింహప్ప నారా లోకేష్ కు పుష్పగుచ్చం అందజేశారు.



లోకేష్ పాదయాత్రలో పాల్గొన్న పెనుకొండ నాయకులు

కనగానపల్లి : నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టం వెంకటేష్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన లోకేష్‌కు పుష్పగుచ్చం అందేజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపి కదిరి నియెజకవర్గం ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : కదిరి నియోజకవర్గంలో నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్రలో తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు కురుబ కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ యువనేత నారా లోకేష్ కు పుష్పగుచ్చాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లోకేష్ దృష్టికి మైనార్టీల సమస్యలు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

నారాలోకేశ్ యువగళం పాదయాత్ర త్వరలో ధర్మవరం నియోజకవర్గంలో అడుగుపెడుతోందని, ఈ పాదయాత్రలో మైనార్టీల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తామని జిల్లా మైనార్టీ సంఘం ప్రధానకార్యదర్శి నాగూరుస్సేన్ తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం ముస్లీం మైనార్టీల ఆత్మీయ సమావేశాన్ని నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు అత్తరోహింబాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ తన నాలుగేళ్ల పాలనలో ముస్లీంలను నట్టేట ముంచిందన్నారు. మైనార్టీల సమస్యలపై పాదయాత్రలో నారాలోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీలు తొండూరు కుళ్లాయప్ప, షామీర్, సాహిద్, మున్ని, బాబా, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో యువగళం పాదయాత్రకు స్థానం

ప్రజాశక్తి - మడకశిర

నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు .మంగళవారం ఆయన టిడిపి స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యువగళం యాత్రకు విశేష స్పందన లభిస్తోందన్నారు. వైసిపి ప్రభుత్వ శాసనసభను కౌరవ సభగా మార్చిందని విమర్శించారు. ఎమ్మెల్యేపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి ,జిల్లా మైనార్టీ నాయకుడు భక్షర్, పట్టణ అధ్యక్షుడు మనోహర్, క్లస్టర్ ఇంచార్జ్ నాగరాజు, కౌన్సిలర్ ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు తరలిన తెలుగు తమ్ముళ్లు

బుక్కపట్నం : నారా లోకేష్ యువగళం పాదయాత్ర పుట్టపర్తి నియోజకవర్గంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు భారీగా బయలుదేరి వెళ్లారు. పాదయాత్రకు సంఘీభావంగా మండల కేంద్రంలో బాణాసంచా పేల్చారు. పాదయాత్రకు బయలుదేరి వెళ్లిన వారిలో టిడిపి సీనియర్ నాయకులు పెద్దరా సు సుబ్రహ్మణ్యం, కన్వీనర్ మల్ రెడ్డి, ఎస్సీ సెల్ నియోజవర్గ అధ్యక్షులు యశోద, తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్య గౌడ్, నాయకులు కాయగూరల చంద్ర, జంగం వెంకటరాముడు, మీసాల మురళి, సంఘ సుధాకర్, సయ్యద్ బాషా తదతరులు ఉన్నారు.

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బహిరంగ వేలం

ధర్మవరం టౌన్ : గత ఏడాది కంటే మున్సిపాలిటీకి వారపుసంత వేలం పాటలో స్వల్ప ఆదాయం వచ్చింది.. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చైర్‌పర్సన్ లింగంనిర్మల అధ్యక్షతన మున్సిపల్ కమషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం వారపుసంత, జంతువధశాలకు బహిరంగవేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వేలం పాటలో పాల్గొనే వారు మున్సిపాలిటీకి ఎటువంటి బకాయిలు ఉండరాదని, రూ.30లక్షలు డిపాజిట్‌తో పాటు రూ.10లక్షలు సాల్వెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని అన్నారు. ఈ వేలం పాటలో రాఘవరెడ్డి, ఇబ్రహీం పాల్గొన్నారు.

ఉద్యోగుల పనితీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి - మడకశిర రూరల్

సచివాలయ ఉద్యోగుల పనితీరుపై డిఎల్‌డిఒ తీవ్ర ఆగ్రహం వ్యక్త చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండల పరిధిలోని గంగులవాయి పాలెం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు వివిధ రకాల సచివాలయాల్లో పెండింగ్లో ఉన్న సర్వే పనులను వేగవంతం చేయాలని సూచించారు సచివాలయ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ శైలజ, పంచాయతీ కార్యదర్శి జనార్ధన్, వీఆర్వో రామాంజి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు

పంటనష్టపోయిన రైతులను ఆదుకోండి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఇటీవల కురిసిన వర్షాలకు నియోజకవర్గంలో రైతులు సాగుచేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, బాధిత రైతులకు తక్షణమే ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం తన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షాల వల్ల పంటలు పూర్తిగా దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. అయితే ప్రజాప్రతినిధులు కానీ అధికారులు కానీ అటు వైపు కన్నెత్తి చూడకపోవడం బాధాకరమన్నారు. రైతులు జరిగిన నష్టాన్ని అధికారులకు తెలియజేసినా ఏ మాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ మేరకు తాడిమర్రి బత్తలపల్లి మండలాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించామని, నష్టపోయిన అరటిపంట రైతులకు ఒక్కో రైతుకు రూ.2లక్షలు, వరి, మొక్కజొన్న తదితర పంటలకు ఒక్కో రైతుకు రూ.50వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం





విద్యార్థినులకు రాగిజావా పంపిణీ చేస్తున్న హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల, ధర్మవరం ఆర్డీవో తిప్పేనాయక్

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు రాగి జావా పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందనిమున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ పేర్కొన్నారు. పట్టణంలోని ఎంజిఎం ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు రాగిజావాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఇంద్రజ, మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యం మాట్లాడుతూ ప్రభుత్వ బడులలో చదువుతున్న పట్టణ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు గుణాత్మకమైన విద్యతో పాటు సంపూర్ణ పోషకాహారం అందించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ నిర్వాహకులు నౌషాద్, ఫిజికల్ డైరెక్టర్లు లోకనాథ్, సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు రాగిజావా పంపిణీ చేశారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం సిద్దారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతం జగన్మోహన్, జెడ్పీటీసీ అమరావతి, స్థానిక సర్పంచి ఎస్ రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని బిఎస్ఆర్ బాలికల ఉన్నతపాఠశాలలో విద్యార్థినులకు ప్రభుత్వం అందించే రాగిజావాను ఆర్డీవో తిప్పే నాయక్,మున్సిపల్ కమిషనర్

రాగిజావ పంపిణీలో అధికారులు

మల్లికార్జున మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో, కమిషనర్ మాట్లాడుతూ వారంలో మూడురోజులపాటు రాగిజావాను విద్యార్థులకు అందిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని కొత్తపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో, 14 వార్డులోని ప్రాథమికపాఠశాలలో కౌన్సిలర్ జేసీబీ రమణ, కడప రంగస్వామి, కేతాలోకేష్, నీలూరి వెంకటరాముడు నాయకులు చాంద్‌బాషా, రమణారెడ్డి, పాఠశాల హెచ్ఎం సంజీవయ్య, 25వ వార్డులోని పాఠశాలలో కౌన్సిలర్ మేడాపురం వెంకటేశ్‌విద్యార్థులకు రాగిజావాను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లు మేరీ వర కుమారి, ఉమాపతి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ బైమంతకరమణ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మండలంలోని ఉప్పర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాగిజావా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఎంఇఒ చాముండేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి గజ్జల వెంగళరెడ్డి, దంపెట్ల సర్పంచి చల్లా కరుణాకర్ నాయుడు,ఉపాధ్యాయులు దుస్తాన్ వలి, గాయిత్రి, కార్యదర్శి భారతి, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఎంపిపి చంద్రశేఖర్, రొద్దం సర్పంచి రూప చేతుల మీదుగా విద్యార్థులకు రాగిజావాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ ఛైర్మన్ సుబ్బారాయుడు, సచివాలయ కన్వీనర్ ఆంజనేయులు, రమేష్, గిరీష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిగి : జగనన్న గోరుముద్దలో భాగంగా సత్య సాయి ట్రస్ట్ సంయుక్తంగా ప్రభుత్వం పాఠశాలలోని విద్యార్థులకు అందజేస్తున్న రాగిజావా పంపిణీ కార్యక్రమంలో ఎంఇఒ లక్ష్మీదేవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సరస్వతి, జెడ్పీటీసీ శ్రీరాములు, సర్పంచి లక్ష్మీదేవిచ శివశంకర్‌చ అధికారులుచ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావా పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అశోక్ కుమార్, స్థానిక సర్పంచి గంగాదేవి నరసింహామూర్తి, మండల సచివాలయాల కన్వీనర్ షేక్ ఇమామ్ వలి, సచివాల కన్వీనర్ వడ్డేఆంజి, స్కూల్ చైర్మన్ బొంబాయి బాబు, సర్పంచి వేణు, వార్డుసభ్యులు జెగ్రీరామాంజి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖాదర్ వలీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసి అనుష, సర్పంచి సంధ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు రాగిజావా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నాగరాజు యాదవ్, ప్రధానోపాధ్యాయులు జయప్రద, రఘు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలి

అందుకే రాగిజావ పంపిణీ - విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

విద్యార్థులకు విద్యతో పాటు పౌష్టికాహారం అందించడంలో భాగంగానే రాగి జావ పంపిణీ చేస్తున్నట్లు విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని రాధాకృష్ణ పురపాలక సంఘం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రాగి జావా పంపిణీ కార్యక్రమాన్ని విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతో మధ్యాహ్న భోజనంలో రాగిజావను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాగిజావను తీసుకోవడం వల్ల మాంసకృతులు, క్యాల్షియం మెండుగా ఉండి జుట్టు బాగా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షులు పోరాళు శిల్ప, పురపాలక సంఘం ఉపాధ్యక్షులు వలిబాషా, మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్రరెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి, కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహశీల్దార్ మారుతి, మండల విద్యాశాఖాధికారిణి నాగమణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌నాయుడు, మున్సిపల్ వార్డు సభ్యులు లావణ్య, దేవరాజ్, శివకుమార్, శారద కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, శర్మాస్, వైసిపి నాయకులు శివ, శ్రీరామరెడ్డి, బషీర్, నిజాముద్దీన్, రామాంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండలంలోని రోటరీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం రాగిజావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి డి.సునీత మాట్లాడుతూ ఎండాకాలంలో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాగిజావ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం పి.లక్ష్మీదేవి, సర్పంచి, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరవకొండ : చిన్నారులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ప్రభుత్వం పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారంతోపాటు రాగిజావా అందిస్తున్నట్లు విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గడేకల్ గ్రామంలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వైసిపి నాయకులు కరణం భీంరెడ్డి, ఉమాశంకర్, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : రాష్ట్రంలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైసిపి నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా పట్టణ పరిధిలోని మున్సిపల్ ఎస్‌ఎస్‌ఎస్‌ఆర్‌ఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. తర్వాత పాఠశాలలోని మౌలిక వసతులపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులకు పౌష్టికాహారంతోపాటు నాణ్యమైన విద్యను అందిస్తోందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో మంచి భవిష్యత్తు నిర్మించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా, తహశీల్దార్ మునివేలు, మండల విద్యాధికారి నాగరాజు, వైసిపి నాయకులు నగరూరు బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : జగనన్న గోరుముద్దలో భాగంగా మండల పరిధిలో పంపనూరు ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచి ఎడమల ఎర్రస్వామి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ పాఠశాలల్లో వారంలో మూడు రోజులుపాటు రాజిజావ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : జగనన్న గోరుముద్దలో మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసిపి సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, ఎంపిపి నాగేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం జగనన్న ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సుప్రియ, వైస్ ఎంపిపి వెంకటలక్ష్మి, పాఠశాల కమిటీ ఛైర్మన్ బాలకృష్ణారెడ్డి, ఎంపిటిసి శంకర్‌యాదవ్, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, లక్ష్మీదేవి, హేమలత, శ్రీదేవి, వైసిపి నాయకులు శివయ్య, గోపాల్, భాస్కర్‌రెడ్డి, రమేష్, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపిపి జి.విశాలాక్షి, మండల విద్యాధికారి బి.రవినాయక్ తెలిపారు. గోరుముద్ద పథకం అమలులో భాగంగా మండలంలోని కొత్తపేట గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు రాగిజావను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆర్. గురు మస్తాన్, వైసిపి నాయకులు ఎస్.రాముయాదవ్, సుధాకర్ యాదవ్, వెంకటరాముడు, బి.సురేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని జడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ విద్యార్థినులకు రాగిజావ అందజేశారు.

యాడికి : జగనన్న గోరుముద్దలో భాగంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రాగి జావా పంపిణీ కార్యక్రమాన్ని వైసిపి మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, ఉప సర్పంచి కాసా చంద్రమోహన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కాశప్ప, హెచ్‌ఎం ఎస్వీ విజయమ్మ, స్కూల్ కమిటీ ఛైర్మన్, ఎంపిటిసి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



రాయదుర్గంలో విద్యార్థినులకు రాగిజావ పంపిణీ చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి



బుక్కరాయసముద్రం, విడపనకల్లు, గుత్తిలో విద్యార్థినీ, విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న అతిథులు



విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

గుత్తి : పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మంగళవారం గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఎపి ఆదర్శ కళాశాల, మహాత్మ జూనియర్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాలల్లో పరీక్షలు రాస్తున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు అందజేశారు. వేసవికాలం దృష్ట్యా విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ తెలిపారు. గుత్తి, గుంతకల్లు పట్టణాల్లోని పరీక్ష కేంద్రాల వద్ద రోజూ దాదాపు వెయ్యి మందికి మజ్జిగను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

రైతులను ఆదుకోవాలని సిఎంకు వినతి

శింగనమల : నియోజకవర్గంలో ఇటీవల కురిసిన భారీ వడగండ్ల గాలివానకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ముఖ్యమంత్రి జగన్‌కు విన్నవించారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరై సిఎం జగన్‌ను కలిసి రైతుల వివరాలను అందజేశారు. ఇందుకు సిఎం సానుకూలంగా స్పందిస్తూ నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఓటమిని జీర్ణించుకోలేకే టిడిపి ఎమ్మెల్యేపై దాడి

ఆత్మకూరు : ఎమ్మెల్సీ ఓటమిని జీర్ణించుకోలేకనే వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీలో టిడిపి ఎమ్మెల్యే బాల వీరాంజనేయస్వామిపై దాడికి పాల్పడ్డారని టిడిపి మండల కన్వీనర్ గంతి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి ఎమ్మెల్యేలు ఆలయం లాంటి అసెంబ్లీని కౌరవ సభగా మార్చారన్నారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీ సమావేశాల్లో వైసిపి ఎమ్మెల్యేలు రౌడీల్లా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి కైవసం చేసుకోవడంతో ఓటమిని జీర్ణించలేకనే సిఎం జగన్ తన ఎమ్మెల్యేలతో టిడిపి ఎమ్మెల్యేలపై దాడి చేయించారని ఆరోపించారు. వైసిపి అక్రమాలు, అరాచకాలకు ప్రజలు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి అధికార పెత్తనం, అరాచకాలను ఆపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

వయోవృద్ధుల పోషణ చట్టంపై అవగాహన

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న రామకృష్ణ వృద్ధాశ్రమంలో వయోవృద్ధులు, తల్లిదండ్రుల పోషణ చట్టం-2007పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అబ్దుల్ రసూల్ అవగాహన కల్పించారు. వయోవృద్ధులకు చేతికర్రలు, వినికిడి యంత్రం, వీల్‌ఛైర్ కోసం దరఖాస్తు చేసే విధానంపై వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మారుతి, ఎంపిడిఒ కొండయ్య, ఎస్ఐ సుమన్, తదితరులు పాల్గొన్నారు.

డేగల సంజప్పకు నివాళి

ప్రజాశక్తి-శింగనమల

అనంతపురం టిడిపి అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి తండ్రి సంజప్ప మృతికి పలువురు నాయకులు మంగళవారం నివాళులర్పించారు. సంజప్ప ఆరోగ్యం క్షీణించి సోమవారం రాత్రి అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో మృతిచెందాడు. దీంతో మృతదేహాన్ని స్వగ్రామం తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే యామినీబాల, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ, వైసిపి నాయకులు గోకుల్‌నాథ్‌రెడ్డి, నర్సప్ప, సిపిఐ నాయకులు చిన్నప్పయాదవ్, మధుయాదవ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అందుబాటులో లేకపోవడంతో ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు, మాజీమంత్రి శమంతకమణి, నాయకులు అశోక్, తదితరులు డేగల కృష్ణమూర్తిని ఫోన్‌లో పరామర్శించారు.



కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజుజుకు విన్నవిస్తున్న న్యాయవాది గౌని ప్రతాప్‌రెడ్డి

అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్ ఆమోదానికి వినతి

రాయదుర్గం : న్యాయవాదులకు భద్రత కల్పిస్తూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతిపాదించిన 'అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లు'ను పార్లమెంట్‌లో ఆమోదించాలని బెంగళూరు పర్యటనకు వచ్చిన కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజుజును రాయదుర్గానికి చెందిన న్యాయవాది గౌని ప్రతాప్‌రెడ్డి మంగళవారం కలిసి విజ్ఞప్తి చేశారు. దేశంలో వరుసగా అడ్వకేట్‌లపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. వీటిని నియంత్రించడానికి పార్లమెంటులో చట్టం తీసుకురావాలని కోరారు. అలాగే ప్రతి రాష్ట్రంలో బిల్లును ఆమోదించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు మంత్రి కిరణ్ రిజుజు సానుకూలంగా స్పందించినట్లు ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన
ఘనంగా వార్షిక అథ్లెటిక్ మీట్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులకు క్రీడలు ద్వారా మానసిక వికాసంతోపాటు టీమ్ వర్క్ పెంపొందుతుందని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన తెలిపారు. మంగళవారం స్థానిక జెఎన్‌టియు క్రీడా మైదానంలో ఇంజినీరింగ్ కళాశాల-2023 వార్షిక ఆథ్లెటెక్ మీట్‌లో భాగంగా టీచింగ్, నాన్ టీచింగ్, విద్యార్థులకు ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను విసి ప్రారంభించారు. ముందుగా విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. తర్వాత ప్రిన్సిపాల్ పి.సుజాత అధ్యక్షతన



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న జెఎన్‌టియు విసి, అధికారులు



గౌరవ వందనం స్వీకరిస్తున్న జెఎన్‌టియు విసి రంగజనార్ధన

ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విసి మాట్లాడుతూ క్రీడలు ఆడటం వల్ల విద్యార్థుల్లో మానసిక ఎదుగుదల చురగ్గా ఉంటుందన్నారు. ముఖ్యంగా సోషియల్, కమ్యునికేషన్స్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం రన్నింగ్, షాట్‌పుట్, లాంగ్‌జంప్ వంటి పోటీలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో జెఎన్‌టియు రెక్టార్ విజయకుమార్, రిజిస్టార్ సి.శశిధర్, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జోజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ భవానీ, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


Prop : Prathap Reddy . K
Vijetha Studio & Colour Lab
Ph : 9440026359 08556-291359
New State Bank Complex , Gorantla , Sreesathyasai (Dist) A.P
PINCODE : 515231
Email. vijethalab@gmail.com
creativity photography
ఉగాది శుభాకాంక్షలు
మండలంలోని కస్టమర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, ఫోటోగ్రాఫర్స్‌కు, బంధువులకు, నాయకులకు ఉగాది పండుగ శుభాకాంక్షలు.
విజేత డిజిటల్ స్టూడియో & కలర్ ల్యాబ్
న్యూ ఎస్.బి.ఐ. కాంప్లెక్స్, మెయిన్‌రోడ్డు, గోరంట్ల
కె.ప్రతాప్‌రెడ్డి
ప్రొప్రైటర్:
విజేత స్టూడియో
కలర్ ల్యాబ్, గోరంట్ల,
సెల్: 9440026359.


ఉగాది శుభాకాంక్షలు
మండలంలోని అధికారులకు, మిత్రులకు, మా తోటి వార్డెన్లకు, నాయకులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఉగాది పండుగ శుభాకాంక్షలు.
గోపాల్
బి.సి. హాస్టల్ వార్డెన్, గోరంట్ల.


ఉగాది శుభాకాంక్షలు
YSRCP నాయకులకు, కార్యకర్తలకు, అధికారులకు, గుంతకల్లు మండల ప్రజలకు
ఉగాది శుభాకాంక్షలు
బి.వి. మాధవి
MPP, గుంతకల్లు
బి. మోహన్ రావు
YSRCP మండల కన్వీనర్, గుంతకల్లు


ఉగాది శుభాకాంక్షలు
లలితజ్యూవేలరీస్
ప్రొ॥ బి.ఎస్.గుప్తా & సన్స్, బి.ఎస్. వెంకటరాజు
(ధర్మవరం వారి అంగడి), మాదవరాయస్వామి పార్క్ ఎదురుగా, మెయిన్‌రోడ్డు, గోరంట్ల, సెల్: 9440834779, 9490857629.
మండలంలోని కస్టమర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, బంధువులకు, అధికారులకు ఉగాది పండుగ శుభాకాంక్షలు. మా షాపు నందు నాణ్యమైన బంగారు మరియు వెండి ఆభరణములు సరసమైన ధరలకు లభించును.
916 కె.డి.ఎం. హాల్‌మార్క్ నగలు ఆర్డర్లపై చేయబడును.


ఉగాది శుభాకాంక్షలు
అనంతపురం నగర ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, అనధికారులకు
ఉగాది శుభాకాంక్షలు
అనంతపురం నగరపాలక సంస్థ సిబ్బంది


శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి వారి దేవస్థానము
కసాపురము (గ్రా॥), గుంతకల్లు (మం॥), అనంతపురము జిల్లా
శ్రీ శోభకృత్ నామ సంవత్సరము ఉగాది మహోత్సవములకు
తేది:22-03-2023 నుండి తేది:24-03-2023 వరకు
ఆహ్వానము: కార్యక్రమ వివరములు:
తేది:22-03-2023: చైత్ర శుద్ధ పాడ్యమి బుధవారము:
సాయంత్రము: 05:00 గం॥లకు పంచాంగ శ్రవణము. సాయంత్రంము: 6.30 గం॥లకు శ్రీ సీతారామ లక్ష్మణ సహిత శ్రీ ఆంజనేయస్వామి వార్లను గరుడ వాహనముపై "గ్రామోత్సవము". రాత్రి: 08:00 గం॥ల నుండి "సాంస్కృతిక కార్యక్రమములు"
తేది:23-03-2023: చైత్ర శుద్ధ విదియ గురువారము:
సాయంత్రము: 4.00 గం॥ల నుండి "రథాంగ హోమము, సంప్రోక్షణ బలిహరణ. సాయంత్రము: 6.00 గం॥లకు విశేష పుష్పాలంకరణతో శ్రీ సీతారామ లక్ష్మణ సహిత శ్రీ ఆంజనేయస్వామి వార్ల "రథోత్సవము".
రాత్రి: 08:00 గం॥లకు సాంస్కృతిక కార్యక్రమములు.
తేది:24-03-2023: చైత్ర శుద్ధ తదియ శుక్రవారము:
రాత్రి: గం॥ 07:15 ని॥లకు శ్రీ కాశీ విశాలాక్షి సహిత విశ్వేశ్వర స్వామి వార్ల దేవాలయము వద్ద శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి వారిచే "లంకాదహనము" (బాణసంచా వేడుక) అర్చన, వేదగోష్టి, తీర్థ ప్రసాద వినియోగము.
తేది:30-03-2023: చైత్ర శుద్ధ నవమి గురువారము:
ఉదయం గం॥10.05 ని॥లకు శ్రీ సీతారామచంద్ర స్వామి వార్ల తిరుకళ్యాణ మహోత్సవము. సాయంత్రం గం॥ 5.30 ని॥లకు శ్రీ సీతారామ లక్ష్మణ సహిత శ్రీ ఆంజనేయ స్వామి వార్లను గజవాహనములపై "గ్రామోత్సవము".
పై కార్యక్రమములందు భక్తాదులు విశేషముగా పాల్గొని శ్రీ స్వామివార్ల కృపకు పాత్రులు కావలసినదిగా కోరడమైనది.
డి.వెంకటేశ్వరరెడ్డి, కార్యనిర్వహణాధికారి.


ఉగాది మరియు శ్రీరామనవమి శుభాకాంక్షలతో...
ఇండియా ఫర్ ఇండియా
స్పందించు... సాయం అందించు
మీ వంతు సహాయం ఎన్నో జీవితాలను ప్రభావితం చేయగలదు!
సంప్రదించండి:
మేనేజర్,
ఇండియా ఫర్ ఇండియా
రూరల్ డెవలప్ మెంట్ ట్రస్ట్
అనంతపురము
ఫోన్: 9441576527
ఈ QR కోడ్ ను స్కాన్ చేయండి
మా వెబ్ సైట్ ను సందర్శించండి
https://rdtfvf.org/donate
Moncho Ferrer
Programme Director - RDT
VicenteFerrer
Rural Development Trust


ఉగాది శుభాకాంక్షలు Cell: 8886522194.
VYSHNAVI E.M. SCHOOL
CBSE curriculum as per NEP 2023
Admissions are open for all classes
విద్యార్థినీ, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు "ఉగాది" శుభాకాంక్షలతో...
ప్రజాశక్తి శ్రేయోభిలాషి
PUTLUR ROAD, Opp: ANR GARDENS
TADIPATRI - 515 411, ANANTHAPUR (Dist.)
Contact: 8639611261